

డైట్ చార్జీలు ఇచ్చేదెప్పుడు?

ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన శాఖలకు అనుబంధంగా నిర్వహిస్తున్న వసతిగృహాల్లో విద్యార్థుల డైట్ చార్జీల పెంపు కాగితాలకే పరిమితమైంది. 8లో▸



ప్రైవేటు ప్రాక్టీస్‌కు నో

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తూ సమయపాలన పాటించడం లేదు. వైద్యులు పనివేళల్లో ప్రైవేటు ప్రాక్టీస్‌కు దూరంగా ఉండాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
24.0 /21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. మంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కవితను కలిసిన టీబీజీకేఎస్ నేతలు



కవితతో టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ముఖ్య నేతలు ఆ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య బుధవారం హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లి ఆమెతో భేటీ అయ్యారు. సింగరేణి ఎన్నికలు ఈ నెల 27న ఉన్న నేపథ్యంలో ఎలా సన్నద్ధం కావాలో చర్చించారు. కంపెనీలో కారుణ్య ఉద్యోగాల వల్ల యువకార్మికుల సంఖ్య పెరిగిందని, యూనియన్‌లో కూడా వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె నేతలకు సూచించారు. ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో ఆమె సూచనలు చేశారు. టీబీజీకేఎస్ సాధించిన హక్కులు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన మేలును కార్మికులకు వివరించాలని తెలిపారు.

ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



వర్షం కారణంగా ఆగిపోయిన వాహనాలు

శ్రీరాంపూర్: వర్షం వల్ల శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో బుధవారం బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి కురిసిన వర్షంతో క్వారీలోని మైనింగ్ ఆపరేషన్స్‌ను పూర్తిగా నిలిపివేశారు. బొగ్గు ఉత్పత్తితోపాటు ఓవర్ బర్డెన్ మట్టి వెలికితీత పనులు కూడా ఆపివేశారు. దీంతో సుమారు 1000 టన్నుల బొగ్గు ఉత్పత్తి నష్టంతోపాటు పదివేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు ఆగిపోయాయి. వర్షం వల్ల క్వారీలో చేరుతున్న నీటిని ఎప్పటికప్పుడు భారీ పంపుల ద్వారా ఉపరితలానికి పంపింగ్ చేస్తున్నారు. వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేసి వర్షం పరిస్థితిని ఓసీపీ అధికారులు సమీక్షిస్తున్నారు.

'పది' పరీక్ష ఫీజు గడువు పెంపు

మంచిర్యాలఅర్బన్: వచ్చే సంవత్సరం మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువు పొడిగించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 7వరకు విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫీజు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 14వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 21వరకు, రూ.500లతో వచ్చే సంవత్సరం జనవరి 3వరకు చెల్లించే అవకాశం కల్పించారని తెలిపారు. పరీక్ష రుసుం అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడింటికి రూ.110, ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, వృత్తివిద్య రూ.185 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రశ్నిస్తాం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు అశోక్

చెన్నూర్: చెన్నూర్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని, ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రశ్నిస్తామని బీజేపీ నాయకుడు దుర్గం అశోక్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బులు, మద్యం పంపిణీ చేసిన వాళ్లు గెలిచారని ఆరోపించారు. ఎన్నికల్లో తన గెలుపు కోసం నెల రోజులపాటు శ్రమించిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేలా కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, చారి, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

ముసురుకుంది..



జైపూర్ మండలంలో చిరుజల్లుతో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పిన రైతులు

- చల్లని ఈదురుగాలులతో వణుకు
- ధాన్యం కేంద్రాల్లో రైతుల అవస్థలు

మంచిర్యాలఅగ్రికల్చర్: తుపాన్ ప్రభావంతో జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షం కురుస్తూనే ఉంది. రెండ్రోజులు మబ్బులు కమ్ముకోవడంతో మంగళవారం నుంచి అక్కడక్కడ వర్షం పడుతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. భారీ వర్షం వస్తే ఇన్ని రోజులు ఆరిన ధాన్యం నీటిపాలవుతుందని ఆందోళన చెందుతున్నారు. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు తాండూర్, చెన్నూర్, కోటపల్లి, జన్నారం, కాసిపేట, నెన్నెల, బెల్లంపల్లి, జైపూర్ మండలాల్లో 1 మిల్లీమీటర్ల నుంచి 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిచాంగ్ తుపాన్‌తో రెండ్రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. సూర్యుడు కానరాకపోవడం, మబ్బులు కమ్ముకోవడం, ముసురు వర్షంతోపాటు చల్లని ఈదురుగాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు వణుకుతో మంచం పడుతున్నారు. శ్వాసకోశ వ్యాధులతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. చలితీవ్రత, ముసురు వానతో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. చాలా చోట్ల జనజీవనం స్తంభించి ఇళ్లకే పరిమితం అవుతున్నారు.

ఆరిన ధాన్యం.. తడిసేలా..

జిల్లాలో 60 శాతం వరికోతలు పూర్తయ్యాయి. వేల ఎకరాల్లో వరి కోత, నూర్పిడి దశలో ఉన్నాయి. యంత్రాలు, కూలీల కొరత కారణంగా కోతలు ఆలస్యం అవుతున్నాయి. ఇప్పటికే కోసిన ధాన్యాన్ని కుప్పలుగా పోసి రైతులు టార్పాలిన్లు కప్పారు. కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మరికొన్ని చోట్ల ప్రారంభించకపోవడంతో తూకం లేక ధాన్యం కుప్పల వద్ద రైతులు 20రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. సివి ల్ సప్లయిస్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించా రు. తూకం లేక వేల క్వింటాళ్ల ధాన్యం కేంద్రాల్లో ఉంటోంది. ఇన్ని రోజులు అధికారులు ఎన్నికల విధుల్లో ఉండడం, ప్రస్తుతం వాతావరణ మార్పులు చోటు చేసుకోవడంతో వర్షాలు కురుస్తుండడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం, చెత్తాచెదారం రాకుండా ఆరబెట్టినా తూకం వేయడంలో ఆలస్యం చేశారని, ఇప్పుడు తడిసేలా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, జైపూర్, భీమారం మండలాల్లో కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ధాన్యం తూకం వేయడం, మిల్లులకు తరలించడం చేయడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ చూసినా వందల క్వింటాళ్ల ధాన్యం కుప్పలు ఉంటున్నాయి. ధాన్యం సేకరణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మూడు రోజులుగా మబ్బులు పడుతూ చిరుజల్లులు కురుస్తున్నాయని, భారీ వర్షం వస్తే పరిస్థితి ఏమిటని రైతులు వాపోతున్నారు.

నీటిపాలయ్యేలా ఉంది



ఐదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేసిన. పంట కోసి పది రోజులు అయితంది. తేమ ఎక్కువగా ఉందని కాంటా పెడుతలేరు. రెండు రోజులుగా మబ్బులు పడుతూ ముసురు వర్షం కురుస్తుంది. కవర్లు అద్దెకు తీసుక వచ్చి కప్పుకున్నాం. భారీ వర్షం వస్తే చేతికి వచ్చిన పంట తడుస్తుందోమోనని, రెక్కల కష్టం నీటిపాలు అయ్యేలా ఉంది.

– బానోత్ రంజిత్‌నాయక్,
గ్రామం: పోలంపెల్లి, మం: భీమారం

వడ్లు కొంటలేరు..



వడ్లు ఆరబోసుకొని పది రోజుల నుంచి ఎదురు చూసుడు అవుతుంది. రోజు ఆరబోసుడు కుప్పజేసుడు ఇదే పని అయితంది. తేమ తక్కువ ఉన్న కాంటా పెడుతలేరు. వర్షంతో చేతికి వచ్చిన పంట నీటిపాలు అయితదేమోనని భయమయితంది. కవర్లు కప్పి ఉంచుడయితంది. ఈ మబ్బు చినుకులకు ఆరిన వడ్లు మెత్తపడుతున్నాయి.

– గొనే ఇందిర, భీమారం

'పల్లె' సమరానికి సన్నద్ధం



గ్రామ పంచాయతీ కార్యాలయం

- ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎన్నికలకు ఏర్పాట్లు
- ఫిబ్రవరి ఒకటిన ముగియనున్న పాలకవర్గ పాలన
- ఎన్నికల సిబ్బంది, ఓటరు జాబితా తయారీకి ఆదేశాలు
- నెలాఖరు వరకు నివేదిక అందజేయాలన్న అధికారులు

జిల్లాలో..

గ్రామ పంచాయతీలు	311
వార్డులు	2,730
పోలింగ్ కేంద్రాలు	2,730
మహిళా ఓటర్లు	2,32,562
పురుష ఓటర్లు	2,32,812
ఇతరులు	12
మొత్తం ఓటర్లు	4,65,386

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో ఇక గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఈ నెల 4న రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బంది నియామకం కోసం నెలాఖరు వరకు జాబితా సిద్ధం చేసి పంపించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణలో డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వచ్చేలోగా జిల్లాలో ఓటరు జాబితా తయారీ, బ్యాలెట్‌బాక్సుల ఏర్పాట్లు, బ్యాలెట్ పేపర్లు, సిబ్బంది నియామకం తదితర ఏర్పాట్లపై ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చారు. తాజాగా ఎన్నికల సిబ్బంది నియామకం కోసం జాబితా సిద్ధం చేయాలనే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బుధవారం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు సమావేశమై సమీక్షించారు. ఓటరు జాబితా తయారీ, పంచాయతీల వారీగా ఓటరు జాబితా ప్రదర్శన, ఓటరు సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు తదితర ఏర్పాట్లపై స్పష్టత వచ్చింది. మొత్తంగా ఎన్నికల్లో జిల్లా పంచాయతీ అధికారితోపాటు డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు కీలకంగా వ్యవహరిస్తారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై స్పష్టత వచ్చేలోగా ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెలాఖరులోగా రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి నివేదిక అందించనున్నారు.

మరో 55 రోజులే..

2019 ఫిబ్రవరి 2న కొలువుదీరిన పంచాయతీ పాలకవర్గాల పాలన మరో 55 రోజుల్లో ముగియనుంది. జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించగా.. పాలకవర్గాలన్నీ ఒకేసారి పాలన ప్రారంభించాయి. జిల్లా వ్యాప్తంగా 311 గ్రామ పంచాయతీలకు గాను ఒక పంచాయతీ మినహా 310 పంచాయతీల్లో ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు అప్పట్లో ఐదు నెలలపాటు ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీలు ఉన్నాయి. ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు తెలంగాణకు హరితహారం, నర్సరీలు, పల్లెకు ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, కాంపోస్ట్ షెడ్‌లు ఇలా పలు అభివృద్ధి పనులతోపాటు పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అయ్యారు.

ఎన్నికల సిబ్బంది ప్రక్రియపై..



గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, పర్యవేక్షణలో భాగంగా సిబ్బంది నియామకంపై సమీక్షిస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఓటర్లు పెరిగితే పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా పెరుగుతుంది. ఈ మేరకు మరోసారి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లపై పునః సమీక్షిస్తాం. బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకం వంటి వాటిపై కసరత్తు పూర్తి చేశాం. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అందుకు తగిన ఏర్పాట్లు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాజావుగా నిర్వహించేలా సిద్ధంగా ఉన్నాం.

– వెంకటేశ్వర్‌రావు, జిల్లా పంచాయితీ అధికారి, మంచిర్యాల

ఖాకీ వనంలో బదిలీల టెన్షన్

- కొత్త ఎమ్మెల్యేల వద్ద పైరవీల జాబితా
- నచ్చిన చోట, డిమాండ్ ఉన్న పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్‌కు ప్రయత్నాలు



మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికలు ముగిసాయి. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇదివరకే పోలీసుశాఖలో బదిలీలు జరిగాయి. ఇక గురువారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఎన్నికల కోడ్ ఈ నెల 5తో ముగిసింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మరోసారి పోలీసు శాఖలో భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉంది. దీంతో ఖాకీ వనంలో ఉత్కంఠ మొదలైంది. ఇప్పటికే కొందరు అధికారుల జాబితా జిల్లాలో కొత్తగా ఎన్నికైన ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల వద్దకు చేరినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఎవరెవరు ఎలా పని చేశారు.. ఎవరికి అనుకూలంగా వ్యవహరించారనేది పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కొందరు ఎస్సై స్థాయి అధికారి మొదలుకుని ఏసీపీ స్థాయి అధికారి వరకు ఎమ్మెల్యేల వద్దకు చేరుకుని మర్యాదపూర్వకంగా కలిసి పరిచయాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల అనంతరం బదిలీలు సర్వసాధారణమే అయినా ఇదే అదునుగా భావించిన కొందరు పోలీసు అధికారులు, సీఐలు, ఎస్సైలు తమకు నచ్చిన పోస్టింగ్ కోసం ఖద్దరు చొక్కాలకు సలాం చేస్తూ పైరవీలు ప్రారంభించినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఎక్కువ శాతం వివిధ పనిష్మెంట్ల కింద, వేకెన్సీ రిజర్వ్‌డ్‌లో ఉన్న అధికారులు, వివిధ విభాగాల్లో, లూప్‌లైన్‌లో పని చేస్తున్న అధికారులు పోలీసుస్టేషన్లలో, డిమాండ్ ఉన్న స్టేషన్లలో పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నారు. జిల్లాలో ఎన్నికల ముందు బదిలీలు కాని అధికారులకు ఎలాగైనా బదిలీ జరిగే అవకాశం ఉండడంతో స్థానచలనం కలుగకుండా ముందస్తుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

అన్ని అర్హతలు ఉంటేనే పోస్టింగ్‌లు..

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు కొదువ లేదు. ఇసుక అక్రమ రవాణా, సింగరేణి బొగ్గు గనులు, రైల్వేలైన్ ఉండడంతో గంజాయి దందా, పీడీఎస్ రైస్, స్క్రాప్ దందా, పేకాట, రియల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. నేరాలను నియంత్రించాల్సిన పోలీస్‌శాఖకు నిత్యం ముడుపుల పంట పండుతోంది. ఇలాంటి డిమాండ్ ఉన్న పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్‌ను ఎమ్మెల్యేలకు రూ.లక్షలు ముట్టజెప్పి పైరవీలు చేసుకుని తెచ్చుకోవడం సర్వసాధారణమైంది. సీఐ, ఎస్సై స్థాయి వరకు వీలైతే అంతకన్న ఎక్కువ స్థాయిలో పోస్టింగ్‌లు ఎమ్మెల్యే లెటర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెటర్ ఇవ్వాలంటే ఇప్పుడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా పనిచేసే వారికి, గతంలో తమకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని ఆచి తూచి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ఆలోచిస్తున్నారు. జిల్లాలో 25 పోలీస్‌స్టేషన్లు ఉండగా ఇందులో గత ప్రభుత్వంలో పనిచేసిన ఎమ్మెల్యేల అండతో పోస్టింగ్‌లు పొందిన వారే కావడం గమనార్హం. కులం, గత చరిత్ర, ప్రజాప్రతినిధులతో సంబంధాలతోపాటు చెల్లింపు స్థాయి ఎంత అనేది జిల్లాకు సీఐ, ఎస్సైగా రావాలనుకుంటే అధికారులకు అర్హతలుగా సాధారణ కార్యకర్తకు సైతం తెలిసిన విషయమే. ఒకవేళ నాయకునికి నచ్చకపోతే పక్కనే ఉన్న ప్రాధాన్యత లేని పోలీస్‌స్టేషన్లకు పోస్టింగులు ఇవ్వడం అత్యంత సహజమే.

డిమాండ్ ఉన్న పోలీస్‌స్టేషన్లు..

జిల్లాలో కోల్‌బెల్ట్ పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం సంబంధిత ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ఎస్సైలు, సీఐలు సైతం ప్రదక్షిణ చేస్తున్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న పోలీస్‌స్టేషన్లలో మంచిర్యాల, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, చెన్నూర్, హాజీపూర్, జన్నారం, జైపూర్, సీసీసీ నస్పూర్, మందమర్రి, జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్, రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ ఉన్నాయి.

ఘనంగా అంబేద్కర్ వర్ధంతి



అంబేద్కర్ చిత్రపటం వద్ద డీఎం రవీంద్రనాథ్

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. డీఎం రవీంద్రనాథ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజబాబు, అసిస్టెంట్ మేనేజర్ దేవపాల తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి బస్సుసేవలు

మంచిర్యాల డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. ఈ నెల 24న మంచిర్యాల నుంచి బయలుదేరి కాణిపాకం, వెల్లూర్, కంచి, 26వ రోజు గిరిప్రదక్షిణ అనంతరం 27న మంచిర్యాలకు బస్సు చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున టికెట్ రుసుం నిర్ణయించామని, ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి



యాజమాన్యంతో చర్చిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: పాతమంచిర్యాల శివారు రంగపేటలోని శాలివాహన గ్రీన్ ఎనర్జీ ప్లాంటు కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని బీఎంఎస్ నాయకుడు, కేంద్ర కార్మిక ఉపాధి శాఖ బోర్డు సభ్యుడు సుంకరి మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఏసీఎల్ వినిత పవర్‌ప్లాంటు డైరెక్టర్ నవీన్, ప్లాంటు కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకరి మల్లేశం మాట్లాడుతూ సంవత్సర కాలంగా వేతన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని, ప్లాంటు యాజమాన్యం కార్మికులకు వేతనాలు, ఇతర బకాయిలు చెల్లించడంలో కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్లాంటు డైరెక్టర్ నవీన్ స్పందిస్తూ రెండ్రోజుల్లో కార్మికులకు వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఎంఎస్ నాయకులు రామిరెడ్డి, కమలాకర్, రాజుయాదవ్, శాలివాహన పవర్‌ప్లాంట్ బోర్డు సభ్యుడు శ్రీనివాస్, జనరల్ మేనేజర్ శంకర్, కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, ఎడ్ల శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



నిహాల్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాండూర్: మండలంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్.నిహాల్ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మండల, జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 విభాగం హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే బాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. నిహాల్‌ను బుధవారం పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ సరోజినీ, పీఈటీలు, ఉపాధ్యాయులు సన్మానించారు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు..



అక్షిత

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని మిమ్స్ డిగ్రీ కళాశాల బీకాం మొదటి సంవత్సరం విద్యార్థిని ఎస్.అక్షిత సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. జనవరి 10 నుంచి 12వరకు చెన్నయ్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉపేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ టి.శ్రీనివాస్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్‌రావు, డైరెక్టర్ ఎం.విజయ్‌కుమార్, పీడీ నూనె శ్రీనివాస్ అభినందించారు.

కార్మెల్ విద్యార్థి



షణ్ముఖసాయి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–14 బాస్కెట్ బాల్ పోటీలకు కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన దాసరి షణ్ముఖసాయి ఎంపికయ్యాడు. ఈ నెల 8న రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నాడు.

క్లుప్తంగా

మనస్థాపంతో వృద్ధుడు ఆత్మహత్య

రామకృష్ణాపూర్(చెన్నూర్): ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఏజోన్ రామాలయం ఏరియాకు చెందిన పూజారి కృష్ణ పరందాం (61) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్థాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

చెన్నూర్: హైదరాబాద్‌లోని బేగంపేటలో గల సెంటర్ ఫర్ ఎకనామిక్స్, సోషల్ స్టడీస్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీలలో చెన్నూర్ రైజింగ్‌సన్ పాఠశాల విద్యార్థులు బజ్జూరి హాసిని, ఏంజిల ఎలిజిబెత్ ప్రతిభ కనబర్చారని పాఠశాల కరస్పాండెంట్ ఖాజా ఖంరోద్దీన్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చి ప్రశంస పత్రాలు పొందిన విద్యార్థులను బుధవారం ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికిరణ్, ఉపాధ్యాయులు రఘుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌కు సన్నద్ధం చేయాలి

మంచిర్యాలఅర్బన్: డిసెంబర్ రెండో వారంలో నిర్వహించే జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ (ప్రదర్శన)కు విద్యార్థులను సన్నద్ధం చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ అంశంతో పాటు ఆరోగ్యం, లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్) వ్యవసాయం, కమ్యూనికేషన్ అండ్ ట్రాన్స్‌పోర్ట్, కంప్యూటిషనల్ థింకింగ్ ఉపఅంశాల్లో విద్యార్థులు తమ పరిసరాలలో ఏర్పడుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించే నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు.

జోనల్‌స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న విద్యార్థిని

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, డీఎస్‌వో మీనారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా అండర్–17 బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో మొత్తం 100 మంది బాలికలు పాల్గొన్నారని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 22 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ శిక్షకుడు అరవింద్, అథ్లెటిక్స్ శిక్షకుడు విద్యా సాగర్, పీడీ, పీఈటీలు రాకేష్, మల్లిక, లక్ష్మి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంఎస్ గెలుపు కోసం కృషి చేయాలి

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ గెలుపు కోసం యూనియన్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీకి చెందిన ఈపీ టెక్నీషియన్ బోనాల శ్రీనివాస్‌ను కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిత్యం అలుపెరగని పోరాటాలు చేస్తున్న సంఘం హెచ్ఎంఎస్ మాత్రమేనన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం మితిమీరిపోయిందని ఏ రాజకీయ పార్టీకి తొత్తుగా పనిచేయని ఏకైక సంఘం హెచ్ఎంఎస్ ఒక్కటేనన్నారు. ఉచిత మస్టర్ల కోసం యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరించే సంఘాలకు కార్మికులు తమ ఓటు హక్కు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, సెంట్రల్ కమిటీ నాయకులు జీవన్ జోయల్, తదితరులు పాల్గొన్నారు.

డైట్ చార్జీలు ఇచ్చేదెప్పుడు?

- ఆరేళ్ల క్రితం పెంచినవే ఇప్పటికీ అమలు
- సరుకుల ధరలు పెరిగినా పాత చార్జీలే..
- జులైలో మెస్ చార్జీలు పెంచినా నేటికీ అమలు కాని వైనం
- జీవో విడుదలతోనే సరిపెట్టిన ప్రభుత్వం



బెల్లంపల్లిలోని ప్రభుత్వ బాలుర గురుకుల కళాశాల

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన శాఖలకు అనుబంధంగా నిర్వహిస్తున్న వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల డైట్ చార్జీల పెంపు కాగితాలకే పరిమితమైంది. నెలలు గడుస్తున్నా పెంచిన డైట్ చార్జీలు అమలుకు నోచుకోవడంలేదు. రోజువారీగా పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా విద్యార్థుల డైట్ చార్జీలు పెంచడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైంది. విద్యార్థుల నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు రావడంతో గత ప్రభుత్వం జులైలో 26 శాతం డైట్ చార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించి జీవోను జారీ చేసింది. ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

ఆరేళ్ల క్రితం పెంచిన మెస్‌చార్జీలే అమలు

గురుకులాలు, వసతి గృహాల్లో ఉండి విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఆరేళ్ల క్రితం పెంచిన డైట్ చార్జీలే అమలవుతున్నాయి. 2017–18 విద్యాసంవత్సరంలో ప్రభుత్వం మెస్‌చార్జీలు పెంచింది. ఆ తర్వాత నుంచి మెస్ చార్జీల పెంపుదల లేక పోవడంతో బలవర్ధకమైన ఆహారానికి విద్యార్థులు నోచుకోలేక పోతున్నారు. బాల్యం బలహీన పడుతోంది. ఆరేళ్ల క్రితం నాటికీ ఇప్పటికీ నిత్యావసర, కూరగాయల ధరల్లో ఎంతో వ్యత్యాసం ఉంది. కోడిగుడ్డు నుంచి మొదలుకుని చికెన్, మటన్, కూరగాయలు, ఉప్పు, పప్పు దినుసుల ధరలు అమాంతం పెరిగాయి. ఏటా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాల్సిన ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. మెస్‌చార్జీల పెంపు లేకపోవడంతో అనివార్యంగా విద్యార్థులకు ప్రొవిజన్స్‌ను సగానికి తగ్గించారు.

ప్రిన్సిపాళ్లు, వార్డెన్లపై ఒత్తిళ్లు

గురుకులాలు, వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు సంక్లిష్ట పరిస్థితులను చవి చూస్తున్నారు. మెస్‌చార్జీలు పెంచకుండానే విద్యార్థులకు మెనూ సరిగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిళ్లు తెస్తున్నారు. పదేపదే ఉత్తర్వులు జారీ చేసి మానసిక వొత్తిడి కలిగిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు కాదనలేక ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు సతమతమవుతున్నారు. అంతేకాకుండా విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన ఆహారం అందిస్తున్నామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడంలేదని విమర్శలు ఉన్నాయి. కొత్తగా అధికారం చేపట్టబోయే ప్రభుత్వమైనా చిత్తశుద్ధితో డైట్‌చార్జీలు పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల వివరాలు	
గురుకులాలు, వసతి గృహాల్లోని	
5 నుంచి 7వ తరగతి విద్యార్థులు	17,530
8 నుంచి పదో తరగతి విద్యార్థులు	4,599
ఇంటర్, డిగ్రీ విద్యార్థులు	8,200

జిల్లాలోని గురుకుల విద్యాసంస్థలు, వసతి గృహాలు		
ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాలు	–	10
సాంఘిక సంక్షేమ వసతి గృహాలు	–	24
మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాలు		08
బీసీ వసతి గృహాలు	–	14
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	–	18
మైనార్టీ గురుకులాలు	–	03
కేజీబీవీలు	–	18
టీఎస్ఆర్ఎస్	–	01

జులైలో పెంచిన డైట్ చార్జీల వివరాలు (నెలకు)

తరగతులు	ప్రస్తుత చార్జీలు	పెంచిన చార్జీలు
3 నుంచి 7	రూ.950	రూ.1,200
8 నుంచి 10	రూ.1,100	రూ.1,400
11 నుంచి పీజీ వరకు	రూ.1,500	రూ.1,875

నిధులు విడుదల కాలేదు



విద్యార్థుల డైట్ చార్జీలు పెంచుతున్నట్లు ప్రభుత్వం అప్పట్లో ప్రకటించింది. కానీ ఇంతవరకు నిధులు విడుదల కాలేదు. పెంచిన డైట్ చార్జీలు ఎప్పుడు విడుదల చేస్తారోనని ఎదురు చూస్తున్నాం. విద్యార్థులకు ఉన్నంతలో పౌష్టికాహారం అందిస్తున్నాం. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయడం లేదు. కొత్త ప్రభుత్వం పెరిగిన డైట్ చార్జీలను విడుదల చేస్తుందని ఆశిస్తున్నాం.

– కె.స్వరూపారాణి, ఉమ్మడి జిల్లా సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో

ఏఐటీయూసీని గెలిపిస్తేనే హక్కులు

- యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపిస్తేనే కార్మికులకు కొత్త హక్కులు, సదుపాయాలు వస్తాయని ఆ యూనియన్ అధ్యక్షుడు, వేజ్‌బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం ఆర్కే 6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. దశాబ్దాల ఉద్యమ చరిత్ర కలిగిన ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే నేడు కార్మికులు అనేక హక్కులు, సదుపాయాలు పొందుతున్నారన్నారు. ముఘ్మందు కూడా మరింత మేలు జరగాలంటే ఏఐటీయూసీనే గెలిపించాలని, పైరవీకారి యూనియన్లను చిత్తుగా ఓడించాలన్నారు. తమను గెలిపిస్తే కార్మికులకు పెర్క్స్‌పై పడే ఇన్కంట్యాక్స్‌ను రీయింబర్స్‌మెంట్ చేయిస్తామని, సొంతింటి పథకం అమలు చేస్తామని, సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా వెళ్లడానికి అండర్ గ్రౌండ్‌లో అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పిస్తామని, సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, ఏరియా మైనింగ్ ఇన్‌చార్జి మారేపల్లి బాపు, గని పిట్ సెక్రటరీ సంగం సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలి

- యూనియన్ సెక్రటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలని ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ కోరారు. బుధవారం ఎస్సార్పీ ఓపెన్ కాస్ట్ గనిపై మాట్లాడారు. తాము గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో సింగరేణి కార్మికులకు అనేక హక్కులు, సదుపాయాలు కల్పించామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, సింగరేణిలో ఏ సమస్యలు ఉన్నా కూడా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకోవచ్చన్నారు. కార్మికుల సమస్యలపై పోరాడే సంఘం తమదేనన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, టీబీజీకేఎస్‌కు చెందిన పలువురు కార్మికులు, కార్యకర్తలు ఐఎన్టీయూసీలో చేరారు. వారికి జనక్ ప్రసాద్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జే.శంకర్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు భీమ్‌రావు, కలవేని శ్యామ్, తిరుపతి, రాజు, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, పిట్ సెక్రటరీ జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్పీ 1లో వెంటిలేషన్ లేక అవస్థలు

- హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య



మాట్లాడుతున్న తిప్పారపు సారయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 1 గనిలో వెంటిలేషన్ లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య పేర్కొన్నారు. బుధవారం గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గని భూగర్భంలోని 6 డీప్ డిస్ట్రిక్ట్‌లోని జీరో లెవల్ నుండి వన్ లెవల్ వరకు గాలి సరఫరా కాకపోవడంతో కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారన్నారు. ప్రతిరోజు ఉదయం కార్మికులు మస్టర్ పడిన తర్వాత జన్మభూమి పేరుతో వెట్టిచాకిరి పనులు చేయిస్తున్నారన్నారు. ప్రమాదాలు జరిగితే అధికారులు రిపోర్ట్ రాయకుండా కార్మికులను ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని బెదిరిస్తున్నారన్నారు. గని అధికారులు తమ వైఖరి మార్చుకోవాలన్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి గనిలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి గొల్ల సత్తయ్య, పిట్ సెక్రటరీ రేగుంట సందీప్, నాయకులు పెద్దన్న, దుర్గం లక్ష్మణ్, నామాల శ్రీను, నవీన్, నోముల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను ఆన్‌డ్యూటీగా పరిగణించాలి



వినతిపత్రం ఇస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో బందోబస్తులో పాల్గొన్న సింగరేణి ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ సిబ్బందికి ఆరోజు ఆన్‌డ్యూటీగా పరిగణించాలని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం సెక్యూరిటీ సిబ్బంది భాగ్యరాజ్‌ను కలిసి వినతిపత్రం అందించి, తమ సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందోబస్తుకు వెళ్లిన సెక్యూరిటీ సిబ్బందికి ఆన్‌డ్యూటీ ఇవ్వకుండా స్పెషల్ లీవ్‌గా పరిగణించడంతో ఏడాదిలో వచ్చే స్పెషల్ ఇన్సెంటివ్, ఇతర ఆర్థిక అంశాలపై నష్టం జరుగుతుందన్నారు. యాజమాన్యం దీనిని ఓడీగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కే.శ్రీనివాస్, షరీపుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: పార్లమెంటు సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. దేశంలో 10 శాతం కూడాలేని అగ్రవర్ణాలు దేశాన్ని పాలిస్తున్నాయని, 60 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కడం లేదన్నారు. బీసీలకు రావాల్సిన ప్రజాస్వామ్య వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు గజెల్లి వెంకన్న, పట్టణ అధ్యక్షుడు బోడెంకి మహేష్, నాయకులు శ్రీపతి రాములు, ఆరెందుల రాజేశం, ఎం.వెంకటేష్, కే.శ్రీనివాస్, రాజమల్లు, అంకం సతీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వలస కూలీల కష్టాలు



జన్కాపూర్‌లో కూలీలు వేసుకున్న గుడారాలు



వర్షంలో తడుస్తూ వస్తున్న కూలీలు

భీమిని(బెల్లంపల్లి): భీమిని, కన్నెపల్లి మండలాల్లో పత్తి తీయడానికి వచ్చిన వలస కూలీల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి పత్తి తీసేందుకు వచ్చిన కూలీలు భీమిని, కన్నెపల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో గుడారాలు వేసుకుని ఉంటున్నారు. చిన్నారులు, వృద్ధులతో కలిసి గుడారాల్లోనే ఉంటున్నారు. తుపాన్ ఎఫెక్ట్‌తో ఇటీవల కురుస్తున్న వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ అదే గుడారాల్లో మగ్గుతున్నారు. గుడారాల వద్ద కరెంట్ సైతం లేకపోవడంతో రాత్రి వేళ విషసర్పాల బారినుంచి కాపాడుకునేందుకు అగ్గిమంట వేసుకుంటున్నారు. తాగునీటిని సైతం దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. కాలకృత్యాలకు కాలువలు, గుంతలు, చెరువుల నీరే వాడుకుంటున్నారు. వీరిని తీసుకువచ్చిన గుత్తేదార్లు వారికి అన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ అవేమి కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి



విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఇండియన్ కరెన్సీపై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసర్ల యాదగిరి డిమాండ్ చేశారు. అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఐబీచౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం, స్వేచ్ఛ, స మానత్వం, సౌభ్రాతృత్వం అనే నాలుగు స్తంభా లపై భారత రాజ్యాంగాన్ని నిర్మించారన్నారు. పటిష్టమైన భారత రాజ్యాంగాన్ని నేడు కేంద్ర ప్రభుత్వం మార్పు చేయాలని ప్రయత్నిస్తుందని, దీంతో ప్రజలకు సామాజిక న్యాయం, భావస్వాతంత్ర్యం, సమానత్వం లేకుండా అరాచకాలు పెరిగే ప్రమాదముందన్నారు. దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బని రాజనర్సు, నాయకులు ఎలుక శ్రీనివాస్, అమృత, శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో...

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల మహానాడు నాయకులు మధుకర్, మల్లన్న, సుధీర్, జనార్దన్, నారాయణ, సత్యం, గజెల్లి రాజమల్లు, ఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి రాములు, ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు నందిపాటి రాజు, జైపాల్‌సింగ్, సదానందం, మేడి రాజు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో యువతి మృతి



ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు



రమాదేవి(ఫైల్)

మంచిర్యాలక్రైం: ఆపరేషన్ వికటించి ఓ యువతి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం టికానపల్లెకు చెందిన మేడం శంకరయ్య–శంకరమ్మ దంపతుల కుమార్తె రమాదేవి (23) అనారోగ్యానికి గురికావడంతో ఈ నెల 3న పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు గర్భసంచికి గడ్డలు ఉన్నాయని, ఆపరేషన్ లేకుండా మిషన్ ద్వారా గడ్డలు తీసే ప్రయత్నం చేస్తామని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. సోమవారం రాత్రి 9 గంటలకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన వైద్యులు ఒంటిగంటకు మిషన్ ద్వారానే గడ్డలు తొలగించామని చెప్పి ఐసీయూలోనే ఉంచారు. మంగళవారం ఉదయం పేషెంట్ కండీషన్ సీరియస్ కావడంతో మళ్లీ ఆపరేషన్ చేసే క్రమంలో రమాదేవి మృతి చెందిందని వైద్యులు తెలిపారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు. దీనిపై వైద్యుడు ఆంజనేయప్రసాద్‌ను వివరణ కోరగా అధిక రక్తస్రావం కావడం వల్లే పేషెంట్ కండీషన్ సీరియస్ అయ్యిందని, నా ప్రయత్నం నేను చేశానన్నాడు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రైవేటు ప్రాక్టీస్‌కు నో

- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యులు
- ఉత్తర్వులు జారీ చేసిన కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ
- ఉత్తర్వుల అమలుపైనే అనుమానాలు



బుధవారం మధ్యాహ్నం 12:51 గంటలకు రోగులు లేక ఖాళీగా ఉన్న ఓపీ గది

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందించాల్సిన వైద్యులు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రాక్టీస్ చేస్తూ సమయపాలనను పాటించడం లేదు. దీంతో కాళోజి నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఈ నెల 1న రాష్ట్రంలోని ప్రైవేటు, ప్రభుత్వ వైద్య కళాశాలల వైద్యులు పనివేళల్లో ప్రైవేటు ప్రాక్టీస్‌కు దూరంగా ఉండాలంటూ ఉత్తర్వులు జారీచేసింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రాక్టీస్ చేయవద్దని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఉత్తర్వులు ఇచ్చినట్లు అందులో పేర్కొంది. ఎవరైనా ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించినట్లయితే వారి రిజిస్ట్రేషన్ నంబర్లను తొలగిస్తామని హెచ్చరించింది. అయినా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని కొందరి వైద్యుల తీరు మాత్రం మారడం లేదు. ఆలస్యంగా వచ్చి మధ్యాహ్నం వరకే వైద్యులు వెళ్లిపోతున్నట్లు రోగులు చెబుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దనే..

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులను నియమించి, అన్ని రకాల వైద్య పరికరాలు, వసతులను కల్పించింది. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు, మహారాష్ట్ర ప్రాంతం నుంచి ప్రతిరోజు వందలాది మంది రోగులు వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వస్తుంటారు. ఉదయం 9 గంటలకు ఓపీ మొదలు కావాల్సి ఉండగా 10:30 గంటల తర్వాతే పూర్తిస్థాయిలో ఓపీ చూసేందుకు వైద్యులు వస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే ఓపీ ఆపేసి 12:30 గంటలలోపే వెళ్లిపోతున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు అందక, తిరిగి వెళ్లలేక ఆస్పత్రి ఆవరణలో ఉంటుండగా మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బయోమెట్రిక్ ప్రవేశపెట్టినా వైద్యులు సమయపాలన పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తుండడంతో ఎన్ఎంసీ నిబంధనలు కఠినతరం చేస్తోంది.

ప్రైవేటులో విధులకే ఆసక్తి..

మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో 80 మందికి పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు, వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ వేయాల్సి ఉన్నా ఉదయం మాత్రమే వేస్తున్నారు. లంచ్ సమయంలో ఆస్పత్రిలోనే ఉండాలన్న నిబంధన పాటించడం లేదు.

చర్యలు తీసుకుంటాం



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రిలోనే ఉండాలని ఉత్తర్వులు ఉన్నాయి. భోజన విరామంకు కూడా వెళ్లేందుకు వారికి అనుమతి ఉండదు. ఎంసీహెచ్, జీజీహెచ్‌ల లోని వైద్యులందరూ పూర్తిస్థాయిలో విధుల్లో ఉండేలా తగిన చర్యలను తీసుకుని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూస్తాం.

– డాక్టర్ హరీశ్‌చంద్ర రెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్